క్లుప్తంగా

ఉచిత వైద్య శిబిరం విజయవంతం



రక్తదానం చేస్తున్న దృశ్యం

సంజామల: మండల కేంద్రం సంజామలలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతం అయింది. కోవెలకుంట్ల అబుల్ కలాం ఆజాద్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం, బ్లడ్ డొనేషన్ క్యాంపును వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి, కేడీసీసీ బ్యాంక్ డైరెక్టర్ గుండం సూర్యప్రకాశ్ రెడ్డి, ఎంపీడీఓ నాగ కుమార్ ప్రారంభించారు. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అదేవిధంగా 22 మంది యువకులు బ్లడ్ డొనేషన్ చేశారు.

మంగపల్లిలో ఉచిత వైద్య శిబిరం

మండల పరిధిలోని మంగపల్లి గ్రామంలో నంద్యాల గురు రాఘవేంద్ర బ్యాంక్ కోచింగ్ సెంటర్ అధినేత డాక్టర్ పి దస్తగిరి రెడ్డి ఆర్థిక సహకారంతో పెద్దిరెడ్డి తిమ్మారెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్లు రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరం మేరకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



మృతుని భార్యకు రూ.50వేలు అందజేస్తున్న చేస్తున్న సభ్యులు

డోన్ : పట్టణంలోని రాహుల్ నగర్‌కు చెందిన గీతాయోగాసన సంఘం సభ్యుడు, ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ కురువ శ్రీనివాసులు ఇటీవల విద్యుత్ షాక్‌తో మృతి చెందారు. గీతాయోగాసన సంఘం గురూజీ రాంపుల్లయ్య ఆధ్వర్యంలో గౌరవాధ్యక్షుడు సప్తశైల తిమ్మయ్య, సభ్యులు సంగాల సాయిబాబా, మాకం బాలు, సముద్రాల బాబు, ఈడిగ రంగ స్వామి, శ్రీరాములు తదితరులు శ్రీనివాసులు స్వగ్రామం వెల్దుర్తి మండలం గువ్వలకుంట్లకు వెళ్లి మృతుని భార్య రామాంజినమ్మకు రూ.50వేలు అందజేశారు.

నివాళి



నివాళులర్పిస్తున్న నగర పంచాయతీ చైర్మన్

బేతంచెర్ల: పట్టణంలో రక్త, నేత్రదానంపై ప్రజలను చైతన్యపరిచి రక్త సహాయ బృందం ఏర్పాటుకు కృషి చేసిన లైఫ్ రక్త సహాయ బృందం అధ్యక్షుడు ప్రతాప్ రెడ్డి (42) గుండె పోటుతో మరణించారు. నగర పంచాయతీ చైర్మన్ చలం రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు బుగ్గన చంద్రా రెడ్డి, తిరుమలేశ్వర్‌రెడ్డి, మునేశ్వర్‌రెడ్డి ప్రతాప్ రెడ్డి భౌతిక గాయంపై పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ప్రతాప్ రెడ్డి సేవలను కొనియాడిని ఆ నల్లురు స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యువనేత్ర సేవా సమితి పభ్యులు, పారిశ్రామిక వేత్తలు 68 సార్లు రక్తదానం చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

ప్రభుత్వాసుపత్రిలో పౌష్టికాహారం పంపిణీ



రొట్టె, గుడ్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

డోన్ : స్థానిక ప్రభుత్వాసుపత్రిలో రోగులు, గర్భిణులు, బాలింతలకు ఆదివారం హోసన్నా ఆశ్రమ నిర్వాహకులు జాన్ ప్రభాకర్ పౌష్టికాహారం పంపిణీ చేశారు. ప్యాపిలి మండలం బావిపల్లెకు చెందిన మలిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఆర్థిక సాయంతో రొట్టె, పప్పు, గుడ్లను పంపిణీ చేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు ఫకృద్దీన్, అంజి పాల్గొన్నారు.

గర్భిణికి ఆశ్రయం

డోన్ : కర్నూలు జిల్లా పర్ల గ్రామానికి చెందిన గర్భిణి పరిమలకు డోన్ హోసన్నా వృద్ధాశ్రమం ఆశ్రయం కల్పించింది. తల్లిదండ్రులు లేని పరిమలను పెంచిపెద్ద చేసిన అక్క పర్లకు చెందిన వ్యక్తితో వివాహం చేసింది. గౌండ పనిచేసే భర్త నిత్యం మద్యం సేవించి హింసిస్తున్నాడని ఆశ్రమ నిర్వాహకుడు జాన్ ప్రభాకర్‌ను ఆశ్రయించింది.

సన్మానం


బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామంలో సీఎస్ఐ చర్చిగా పాస్టర్‌గా పాస్టర్ రజిత్ కుమార్ సేవలు అందిస్తున్నారు. ఇక్కడ నుంచి వైఎస్సార్ జిల్లా ప్రొద్దుటూరు సమీపానున్న ఖాదరబాద్ సీఎస్ఐ చర్చికి బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆదివారం పాస్టర్ రజిత్ కుమార్, పెర్సీ ప్రమోల దంపతులను చర్చి నిర్వాహకులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చర్చి సభ్యులు సుమంత్, సాలోమోను, మాధ్యూ, ప్రభుదాసు, అరుణ, సుబ్బమ్మ పాల్గొన్నారు.

ఇంటింటికీ తాగునీరు!

- నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- వరంగా మారిన జల్‌జీవన్ పథకం
- ప్రతిపల్లెలో వెలసిన ఓహెచ్‌ఆర్ ట్యాంకులు...ప్రతి గృహానికి పైప్‌లైన్
- 161 గ్రామాల్లో 298 అభివృద్ధి పనులకు రూ.79 కోట్లు
- వెల్లువెత్తుతున్న హర్షాతిరేకాలు



బనగానపల్లె మండలం నిలువగండ్లలో ఇంటి వద్ద కుళాయి నుంచి నీరు తీసుకెళ్తున్న దృశ్యం(ఫైల్)



భానుముక్కలలోని రవ్వల కొండ పై 2.50లక్షల లీటర్ల సామర్థ్యంతో నిర్మించిన ఓహెచ్‌ఆర్ ట్యాంకు

బనగానపల్లె: ప్రజల వద్దకు పాలనే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలు అమలు చేస్తుంది. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను తీసుకొచ్చి గడప గడపకు సేవలు అందజేస్తుంది. అర్హులైన పేదలందరికీ ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫలాలను నేరుగా లబ్ధిదారుల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఏళ్లతరబడి నీటి సమస్యతో ప్రజలు పడుతున్న ఇబ్బందులపై దృష్టి సారించింది. ప్రజల వద్దకే పాలనతోపాటు ఇంటింటికీ నీటి సరఫరా చేసి శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపట్టింది ప్రభుత్వం. ఇందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టిన జల్‌జీవన్ మిషన్ పథకం వరంగా మారింది. పట్టణాలతోపాటు గ్రామాల్లోనూ ఓహెచ్‌ఆర్ ట్యాంకు నిర్మించడంతోపాటు ఇంటింకీ కుళాయి కనెక్షన్ ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. బనగానపల్లె నియోజకవర్గంలోని 79 గ్రామ సచివాలయ పరిధిలో 161 గ్రామాల్లో ఓహెచ్‌ఆర్ ట్యాంకులు, పైపులైన్ ఏర్పాటుకు సంబంధించి 298 అభివృద్ధి పనులకుగాను రూ.79 కోట్లు మంజూరయ్యాయి. నియోజకవర్గ కేంద్రం బనగానపల్లెతో పాటు కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల, అవుకు, సంజామల మండలాల్లో చేపట్టిన పనులు ఇప్పటికే దాదాపు 80 పూర్తయ్యాయని అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో ఇంటింటికీ నీటి సరఫరా జరుగుతుంది కూడా.

మండలాల వారీగా పథకం వివరాలు :

మండలం	మొత్తం అభివృద్ధి పనులు	మంజూరు నిధులు కోట్లతో
బనగానపల్లె	98	20.96
కోవెలకుంట్ల	38	14.53
కొలిమిగుండ్ల	61	20.46
అవుకు	53	9.96
సంజామల	48	12.77

జనాభా మేరకు ఓహెచ్‌ఆర్‌సీ ట్యాంకు నిర్మాణం :

జిల్లాలో ఎక్కడలేని విధంగా ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ పథకం కింద బనగానపల్లె నియోజకవర్గానికి ఎక్కువగా నిధులు మంజూరయ్యాయి. గ్రామాలు, పట్టణాల్లో జనాభా ప్రాతిపదికన ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారు. ఇంటింటికీ కుళాయి కనెక్షన్‌తో పాటు ఉచితంగా నీటి సరఫరా చేసేందుకు చేపట్టిన ఓహెచ్‌ఆర్ ట్యాంకుల నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. సుమారు 50వేల జనాభా గల బనగానపల్లె పట్టణంలో ఒక్కొక్కటి 2.50లక్షల లీటర్ల సామర్థ్యంతో రెండు ఓహెచ్‌ఆర్ ట్యాంకులను రవ్వలకొండ, ఎన్జీవో కాలనీల్లో రూ.2.59 కోట్లతో చేపట్టారు. వీటి నిర్మాణ పనులు త్వరలో పూర్తి చేసి వీటి ద్వారా పట్టణానికి నీటి సరఫరా చేయడం జరుగుతుందని అధికారులు అంటున్నారు. నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధి పనులను కేంద్ర కమిటీ సభ్యులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు కూడా. సాక్షాత్తూ జిల్లా కలెక్టర్ సమావేశంలో ఈ విషయాన్ని ప్రస్తావించిన తీరు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులకు ప్రత్యక్ష సాక్ష్యం.

చురుగ్గా అభివృద్ధి పనులు



ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి కృషితో ఈ పథకం ద్వారా నియోజకవర్గానికి మొత్తం 298 అభివృద్ధి పనులకుగాను రూ.79 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇప్పటికే 80 శాతం నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనుల మరో మూడు నెలల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం. అభివృద్ధి పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఇంటింటికీ కుళాయి కనెక్షన్ ద్వారా తాగునీటి సమస్య పూర్తిగా తీరుతుంది. ప్రజలు చాలా సంతోష పడుతున్నారు. మాకు సైతం సంతృప్తినిచ్చింది.

– ఉమాకాంత్‌రెడ్డి, డీఈఈ ఆర్‌డబ్ల్యూఎస్, బనగానపల్లె

అవార్డు లభించింది



జల్‌జీవన్ పథకం అమలులో తమ్మడపల్లె గ్రామ పంచాయతీకి అవార్డు లభించింది. గ్రామ పంచాయతీ పరిధిలోని తమ్మడపల్లె, నిలువుగండ్ల, జంబులదిన్నె, రాళ్లకొత్తూరు, తండా గ్రామాల్లో ఈ పథకం అమలులో పూర్తిగా విజయవంతం అయ్యింది. గతంలో నీటి సమస్యతో చాలా ఇబ్బందులు పడ్డాం. ఇంటింటికీ కుళ్లాయి కనెక్షన్ ఏర్పాటుతో ఏళ్లతరబడి నెలకొన్న నీటి సమస్య తీరింది. – వెంకట్రామిరెడ్డి, సర్పంచ్, తమ్మడపల్లె, బనగానపల్లె మండలం

తాగునీటి సమస్య తీరింది



గతంలో పసుపల గ్రామ పంచాయతీ పరిధిలోని తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. పసుపల, చిన్నరాజుపాళెం, పెద్దరాజుపాళెం, బద్రీనాయక్ తాండా, కాలేనాయక్‌తాండా, పసుపలతండా ప్రజలు మరీ ఇబ్బందిపడేవారు. ఉవేసవిలో పడరాని పాట్లు తప్పేవికావు. సమీప వ్యవసాయ బోర్లే నీటికి ఆధారం. జల్‌జీవన్ పథకం ద్వారా ఇంటింకీ కుళాయి కనెక్షన్ ఇవ్వడంతో నీటి సమస్య తీరింది.

–మోహన్‌బాబు, సర్పంచ్ పసుపల, బనగానపల్లె మండలం

ఆలయ నిర్మాణానికి రూ.20వేలు విరాళం



నగదు అందజేస్తున్న దృశ్యం

బనగానపల్లె: మండలంలోని పలుకూరు గ్రామంలో నిర్మాణంలో ఉన్న వేంకటేశ్వర స్వామి ఆలయానికి బేతంచర్ల పట్టణానికి చెందిన సోమశేఖర్ విరాళం అందజేశారు. ఆదివారం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండం శేషిరెడ్డి చేతుల మీదుగా ఆయన గ్రామ పెద్దలకు రూ. 20 వేలు అందజేశారు. వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి దాతలు తమవంతు చేయూతనివ్వాలని ఈ సందర్భంగా గుండంశేషి రెడ్డి కోరారు.

కారు బోల్తాపడి నలుగురికి గాయాలు



గాయపడిన వారిని 108 వాహనంలో తరలిస్తున్న దృశ్యం

డోన్ టౌన్ : మండల పరిధిలోని యు.కొత్తపల్లె గ్రామ సమీపంలో ఆదివారం కారు బోల్తాపడి నలుగురు ప్రయాణికులు గాయపడినట్లు పత్యక్ష సాక్షులు తెలిపారు. వెల్దుర్తి మండలం చెర్లకొత్తూరు గ్రామానికి చెందిన టీడీపీ మండల ఉపాధ్యక్షుడు పుల్లయ్య అనంతపురం జిల్లా గుత్తి వద్ద ఉన్న బాట సుంకులమ్మ దేవాలయం వద్ద పూజా కార్యక్రమాలకు హాజరై తిరుగు ప్రయాణం అయ్యాడు. ఆయన సోదరుడు సోమశేఖర్, గ్రామస్తులు అయ్యపురెడ్డి, మంగంపల్లెకు చెందిన మరో టీడీపీ నాయకుడు శ్రీనివాసులు కలసి వస్తుండగా కొత్తపల్లె సమీపంలో వస్తుండగా టైరుపగలి కారు అదుపుతప్పి బోల్తా పడింది. క్షతగాత్రులను 108 వాహనంలో ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్సల అనంతరం కర్నూలు కిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లినట్లు గ్రామస్తులు తెలిపారు.

రౌడీషీటర్ల కదలికపై ప్రత్యేక నిఘా



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఎస్ఐ కల్పన

కోవెలకుంట్ల: రౌడీషీటర్ల కదలికపై ప్రత్యేక నిఘా ఉంటుందని ఎస్ఐ కల్పన హెచ్చరించారు. ఆదివారం మండలంలోని రేవనూరు పోలీసు స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రౌడీషీటర్లు ప్రవర్తన మార్చుకొని అసాంఘిక కర్యకలాపాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రశాంత జీవనం సాగిస్తున్న రౌడీషీటర్ల తీరును పరిశీలించి వారిపై షీట్ ఎత్తివేస్తామని పేర్కొన్నారు.

30న మండల మీట్

కోవెలకుంట్ల: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 30వ తేదీన మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ రాధిక చెప్పారు. ఎంపీపీ భీమిరెడ్డి రమాదేవి అధ్యక్షతన నిర్వహించే మండల మీట్‌కు ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. సర్వసభ్య సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటిసరఫరా, విద్యుత్, వ్యవసాయ, పశుపోషణ, గ్రామీణ గృహ నిర్మాణం, రెవెన్యూ, వైఎస్సార్ క్రాంతిపథం తదితర శాఖలపై చర్చ సాగుతుందన్నారు. అన్ని శాఖల మండల అధికారులు, ప్రజా ప్రతినిధులు విధిగా హాజరు కావాలని సూచించారు.

కోవెలకుంట్లలో భారీ వర్షం



వర్షం కురుస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: స్థానిక వ్యవసాయ సబ్ డివిజన్‌లోని పలు మండలాల్లో ఆదివారం సాయంత్రం మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో కోవెలకుంట్ల, సంజామల, అవుకు, కొలిమిగుండ్ల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో కురిసిన వర్షం రైతులకు అనుకూలంగా మారింది. ఈనెల 1వ తేదీ నుంచి ఖరీఫ్ సీజన్ ప్రారంభం కాగా ఆయా మండలాల పరిధిలో మొక్కజొన్న, మినుము, పెసర, తదితర పంటలకు వర్షం ఊపిరి పోయగా వివిధ పంటల సాగుకు అనుకూలంగా మారడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వృద్ధులకు అన్నదానం

డోన్ టౌన్ : మండల పరిధిలోని ఓబులాపురం సమీపంలోని శ్రీకాశిరెడ్డి నాయన వృద్ధాశ్రమంలోని వృద్ధులకు పట్టణానికి చెందిన యువకులు ఆదివారం రాత్రి అన్నదానం చేవారు. అదేవిధంగా స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. పట్టణానికి చెందిన చిన్నయ్యగారి నవీన్ తన నాయనమ్మ కృష్ణవేణమ్మ జ్ఞాపకార్థం వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో నవీన్ స్నేహితులు లోకేష్, చంద్రశేఖర్‌రెడ్డి, శివకుమార్, రాఘవేంద్రగౌడ్, ఆశ్రమ కోశాధికారి ఓలేటీ మాధవస్వామి, ఆశ్రమం ఇన్‌చార్జ్ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

29న వేంకటేశ్వరస్వామి ఆలయంలో పూజలు

స్థానిక వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 29వ తేది గురువారం తొలి ఏకాదశి పురష్కరించుకొని ప్రత్యేకపూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు శ్రీకాంత్ శర్మ తెలిపారు. ఉదయం 6గంటల నుంచి సాయంత్రం వరకు అఖండ విష్ణు సహస్ర నామ పారాయణం ఉంటుందన్నారు. భక్తులు పారాయణంలో పాల్గొని స్వామివారి దర్శనం, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని సూచించారు.

జోరుగా ఉల్లి నాట్లు



నాట్లు వేస్తున్న వ్యవసాయకూలీలు

మండలంలోని ఆయా గ్రామాల బోరు బావుల కింద ఉల్లిపంటకు సంబంధించి జోరుగా నాట్లు వేస్తున్నారు. ఆర్ఎస్ రంగాపురం, యంబాయి, సీతారామాపురం, బైనపల్లె, శంకలాపురం, ముద్దవరం, రుద్రవరం గ్రామాల్లోని బోరుబావుల కింద ఉల్లినాటుతున్నారు. ఉల్లికి మార్కెట్లో మంచి ధర లేకున్నప్పటికీ తమ అదృష్టాన్ని పరీక్షించేందుకు రైతన్న సిద్ధమయ్యాడు. ఉల్లి నారు వేసే పనిలో వ్యవసాయకూలీలు, రైతులు నిమగ్నమయ్యారు. – బేతంచెర్ల

ఈరోజు

నేడు కోటపాడులో గడప గడపకు మన ప్రభుత్వం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కోటపాడులో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి తెలిపారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి హాజరవుతారని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాల గురించి వివరించడంతోపాటు ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కరిస్తారని చెప్పారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

విద్యుత్ సమాచారం

వ్యవసాయానికి విద్యుత్ సరఫరా వేళలు

కోవెలకుంట్ల: మండలంలోని ఫీడర్ల పరిధిలో సోమవారం నుంచి వ్యవసాయ రంగానికి పగటి వేళల్లో తొమ్మిది గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు ఏఈ రామసుబ్రహ్మణ్యం చెప్పారు. కోవెలకుంట్ల, గుళ్లదూర్తి, కలుగొట్ల విద్యుత్ సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో విద్యుత్ సరఫరా వేళలను తెలియజేశారు. జోళదరాశి, భీమునిపాడు, అమడాల, గుంజలపాడు, గుళ్లదూర్తి, పొట్టిపాడు, హరివరం, కొత్తపల్లె, అల్లూరు, రేవనూరు, కలుగొట్ల, కొప్పెర్ల ఫీడర్ల పరిధిలోని గ్రామాల్లో ఉదయం 8 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉంటుందని వివరించారు.

అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

డోన్ : కర్నూలు జిల్లా వెల్దుర్తి మండలం బోయినపల్లెకు చెందిన వృద్ధుడు వడ్డె ఎల్లయ్య(60) స్థానిక మాలిక్‌బాబా సంస్థాన్ వద్ద మృతి చెందారు. ఎవ్వరూలేని వడ్డె ఎల్లయ్య యాచక వృత్తితో జీవనం సాగిస్తున్న విషయాన్ని పోలీసుల ద్వారా ద్రోణాచలం సేవాసమితి ఆత్మబంధువు సభ్యులు తెలుసుకున్నారు. సభ్యులు షాధిఖాన రాజు, ల్యాబ్ టెక్నిషియన్ కరుణాకర్, తాహెర్ బాషాలు వృద్ధుడి మృతదేహానికి ఆదివారం హిందూ సంప్రదాయం ప్రకారం అంత్యక్రియలు పూర్తి చేశారు. అంత్యక్రియలకు రోటరీక్లబ్ సభ్యులు రాజయ్యగౌడ్, చంద్రశేఖర్‌రావ్ సహకరించినట్లు ఆత్మబంధువు సభ్యులు తెలిపారు.

విధుల్లో చేరిన వీఆర్‌ఓలు

కోవెలకుంట్ల: మండలంలోని రెండు గ్రామ సచివాలయాలయాల్లో ఖాళీగా ఉన్న స్థానాల్లో వీఆర్ఓలు విధుల్లో చేరినట్లు తహసీల్దార్ పుష్పకుమారి తెలిపారు. రేవనూరు, కోవెలకుంట్ల 1వ గ్రామ సచివాలయాల్లో వీఆర్ఓ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అవుకు మండలం సుంకేసుల, శింగనపల్లె సచివాలయాల్లో పనిచేస్తున్న వీఆర్ఓలు సుజాత, రాజ్యలక్ష్మి బదిలీపై ఇక్కడికి రావడంతో విధుల్లో చేర్చుకున్నట్లు వివరించారు.

పెండింగ్ చలానాలపై స్పెషల్ డ్రైవ్

కొలిమిగుండ్ల: గతంలో వాహనాలపై విధించిన చలానాలపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించినట్లు ఎస్ఐ రమేష్‌రెడ్డి ఆదివారం తెలిపారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా 493 పాత చలానాలను మీసేవ ద్వారా రూ.1.03 లక్షల రికవరీ చేయించినట్లు చెప్పారు. సంబంధిత వాహనదారులు చలానాలను చెక్ చేసుకొని మీ సేవలో చెల్లించాలని సూచించారు.

అన్నదానానికి రూ. 46 వేల విరాళం

బేతంచెర్ల: పట్టణంలోని పూదోట ఆశ్రమంలో లోక కళ్యాణర్థం చేపట్టిన విష్ణు సహస్రనామస్తోత్ర సామూహిక పారాయణంలో పాల్గొన్న భక్తులకు అన్నదానం చేసేందుకు ఆదివారం దాతలు రూ. 46 వేల విరాళం అందజేశారు. ఈసందర్భంగా ఆశ్రమ నిర్వాహకులు గుండాగోపాలు, ఈశ్వర్ ప్రసాద్, రామకృష్ణ లు విరాళం అందజేసిన దాతలు గౌరి హుసేన్‌రెడ్డి, ముద్దాల వైభవ్, ఘడికోట అన్నారావు, రఘు, పవన్ కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, శేషిరెడ్డి, వేణుగోపాలు, స్వామి నాథ్, గోవిందు, చంద్రశేఖర్, రాంపుల్లయ్య, ఉమాకాంతా రెడ్డిని సత్కరించారు.

క్రైం కార్నర్

మామపై అల్లుడు దాడి

బేతంచెర్ల: మండల పరిధిలోని కొమ్మూరు కొట్టాలలో కూతురి కాపుర విషయంలో సర్దిచెప్పడానికి వచ్చిన మామపై అల్లుడు దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది. కొమ్మూరు కొట్టాల గ్రామానికి చెందిన సప్పల అరుణ్ కుమార్‌తో డోన్ మండలం ధర్మవరం గ్రామానికి చెందిన హరిజన బాలన్న కుమార్తె రేణుకకు 14 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. కొంత కాలంగా అరుణ్ కుమార్ భార్య రేణుకను వేధింపులకు గురి చేస్తుండటంతో కూతురు కాపురం విషయంలో సర్ది చెప్పడానికి వచ్చిన బాలన్నపై అల్లుడు రాయితో దాడి చేసి గాయపరిచాడు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివ శంకర్ నాయక్ ఆదివారం తెలిపారు.

తమ్ముడిపై అన్న దాడి

సంజామల: మండల పరిధిలోని పేరుసోములలో తమ్ముడిపై అన్న దాడి చేసిన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రతాప్ తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన లక్ష్మీదేవికి ముగ్గురు కుమారులు. వారికి తనకున్న 3 ఇళ్లను సమానంగా ఇచ్చారు. పెద్ద కుమారుడు గురు శేఖర్ తనకు వచ్చిన వాటా ఇంట్లో ఉన్నాడు. రెండో కుమారుడు గురు ప్రతాప్‌కు వచ్చిన ఇంట్లో చిన్న తమ్ముడు గురు ప్రసాద్‌తోపాటు అమ్మ లక్ష్మీదేవి ఉంటున్నారు. అయితే పెద్ద కుమారుడు తనకు ఇంకో ఇళ్లు కావాలంటూ రోజు మద్యం తాగి గొడవ పడుతున్నాడు. అమ్మపై కట్టెతో దాడి చేయగా తనునూ కొట్టాడాడని గురు ప్రతాప్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రతాప్ తెలిపారు.

న్యాయం చేయమన్నందుకు దాడి

డోన్ టౌన్ : క్లైదుట ఒక అనాథను బైకు తగిలించి ఆపకుండ వెళ్లడంతో గాయాలపాలైన వ్యక్తికి ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆర్థిక సాయం చేసి న్యాయం చేయమన్నందుకు తనపై దాడి చేశారని స్థానిక చిగురమానుపేటకు చెందిన మాల బాల చిరంజీవి పోలీసులను ఆశ్రయించాడు. బాధితుడి వివరాల మేరకు ఈనెల 23తేదీ(శుక్రవారం) రాత్రి గుత్తిరోడ్డులోని అమ్మ హోటల్ వద్ద ఉండగా ఒక వ్యక్తి బైకుపై వెళ్తూ అనాథప్రసాద్ ఢీకొట్టి వెళ్లిపోయాడు. అక్కడే ఉన్న బాల చిరంజీవి క్షతగాత్రుని అభ్యర్థన మేరకు బైకిస్టు గురించి మోకానియక్ యూనియన్ నాయకునికి ఫోన్ చేసి చెప్పాడు. ప్రమాదం విషయంపై ఇద్దరి మధ్య వాదోపవాదాలు జరిగాయి. దీంతో శనివారం రాత్రి బాల చిరంజీవి ఇంటిబయట నిద్రిస్తుండగా యూనియన్ నాయకుడు అతని ఇద్దరు కుమారులుతో పాటు మరో ముగ్గురు దాడి చేసి తీవ్రంగా గాయపరిచినట్లు బాధితుడు వాపోయాడు. ఆదివారం చికిత్సల అనంతరం ఆయన పట్టణ పోలీసులను ఆశ్రయించాడు.బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయాలు

కోవెలకుంట్ల: పట్టణంలోని నాట్లాభవన్ సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ వెంకటరెడ్డి సమాచారం మేరకు పట్టణానికి చెందిన రామసుబ్బయ్య సైకిల్‌పై ఇంటికి వెళుతుండగా జిలానీ బాషా అనే వ్యక్తి ఎదురుగా బైక్‌పై వస్తూ ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామసుబ్బయ్యకు తీవ్ర గాయాలు కాగా ప్రాథమిక చికిత్స అనంతరం నంద్యాల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. క్షతగాత్రుడి కోడలు శ్రీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

వంతెన నిర్మాణం పూర్తి



వంతెన నిర్మించిన దృశ్యం

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని కల్వటాల సమీపంలోని పురాతన లక్ష్మీనరసింహస్వామి స్వామి ఆలయానికి చేరుకునే మార్గంలో వాగులో చేపట్టిన వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి, జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి చొరవతో రూ.25 లక్షలు మంజూరు చేయించడంతో వంతెన పనులు త్వరగా పూర్తి చేశారు. 50 మీటర్ల పొడవు, ఐదు మీటర్ల వెడల్పుతో సౌకర్యంగా ఉండేలా నిర్మించారు. ఏటా కురిసే భారీ వర్షాల కారణంగా ప్రజలు వాగు దాటి వెళ్లాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతుండేవారు. వాగు దాటిన తర్వాత కొండలో పురాతన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉంది. ఆలయం సమీపంలోనే జగనన్న కాలనీలో ఏర్పాటు చేయడంతో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. చాలా మంది గ్రామస్తులు పశువులను మేపుకునేందుకు వాగు దాటి కొండకు వెళ్తుంటారు. గొర్రెల కాపరులు సైతం ఈకొండపై వస్తుంటారు. వర్షాకాలంలో ఇటిక్యాల, కొలిమిగుండ్ల వాగుల్లో నుంచి వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుంటాయి. వాగు దాటి వెళ్లాలంటే ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడ్డాయి. ప్రధానంగా జగనన్న కాలనీ ఏర్పాటు చేయడంతో లబ్ధిదారులకు సౌకర్యంగా ఉండేందుకు నిర్మించారు. ఏళ్ల నుంచి నెలకొన్న సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే కాటసాని, జెడ్పీచైర్మన్ పాపిరెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మయసభ ఏకపాత్రాభినయం పోటీలు

కొలిమిగుండ్ల: షిర్డీసాయి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమిని పురష్కరించుకొని మయసభ ఏకపాత్రాభినయం పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ ట్రస్ట్ చైర్మన్ వీడీ రాజగోపాల్ ఆదివారం తెలిపారు. కొలిమిగుండ్లలోని షిర్డీసాయి ఫంక్షన్ హాల్‌లో ఈపోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆసక్తిగల కళాకారులు ఈనెల 30 వ తేదీలోగా నిమిషం నిడివితో వాయిస్ రికార్డు చేసి 8333963333కు వాట్సాప్ చేయాలని సూచించారు. నగదు బహుమతులు అందజేస్తామన్నారు. అలాగే భక్తిగీతాల పోటీల్లో పాల్గొనే వారు ఒక భక్తి గీతం పాడి 8008527678 వాట్సాప్ నంబర్‌కు పంపాలన్నారు. ఇందులో 12 మందిని ఎంపిక చేసి సంగీత విభావరి ఏర్పాటు చేస్తున్నామన్నారు. కళాకారులను ప్రోత్సహించేందుకు ఈకార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వీడీ రాజ గోపాల్ పేర్కొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్ట్

- రూ.6.60లక్షలు నగదు, 8కార్లు స్వాధీనం



పేకాట స్థావరం వద్ద పోలీసులు స్వాధీనం చేసుకున్న కార్లు

అవుకు:మండల పరిధిలో ఆదివారం సాయంత్రం పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేశారు. అవుకు మండలం శ్రీలక్ష్మీకంబగిరి స్వామి ఆలయానికి సమీపంలోని కొండల్లో కొంతమంది భారీగా గుమికూడి పేకాట ఆడుతున్నారని సమాచారం రావడంతో దాడులు నిర్వహించామని ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపారు. సిబ్బంది ప్రసాద్ రావు, రామగోవిందు, రాజశేఖర్, బాల ఉసేని, హుసేని, వెంకటేష్, చక్రవర్తి, రఫీ కలిసి దాడులు చేపట్టామని, 19 మంది పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ తెలిపారు. అనంతపురం, కడప జిల్లాకు చెందినవారిగా గుర్తించామని, వీరి నుంచి రూ.6.60 లక్షలు స్వాధీనం చేసుకున్నామన్నారు. అలాగే జూదరులకు చెందిన 8 కార్లను స్వాధీనం చేసుకున్నామని, వీరిపై కేసులు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

అంధకారంలో అవుకు

అవుకు: అవుకు మండల పరిధిలోని పలు గ్రామాల్లో దాదాపు 6 గంటల పాటు ప్రజలు అంధకారంలో ఉండిపోయారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి కురిసిన వర్షాలకు పలు చోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ గాలులతో వీచిన వర్షానికి ఎక్కడో విద్యుత్ స్తంభాలు కూలడం లేదా, విద్యుత్ తీగలు తెగడంతో సాయంత్రం 4.30 నుంచి రాత్రి 9 గంటల వరకు విద్యుత్ సరఫరా ఆగిపోయింది. మండల కేంద్రం అవుకుతో పాటు, ఉప్పలపాడు, జూనూతల, కొండమనాయునిపల్లె తదితర గ్రామాల్లో ప్రజలు కరెంట్ లేక అవస్థలు పడ్డారు.